
సాక్షి పల్నాడు

మంగళవారం । 4 । మార్చి । 2025



ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్: రెడ్డినగర్‌లోని వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ద్వితీయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అభిషేకాలు జరిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 527.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.

అప్పాపురం ప్రభకు గ్రామోత్సవం



నాదెండ్ల: మహాశివ రాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లలో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వచ్చిన అప్పాపురం గ్రామ ప్రభకు సోమవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
నరసరావుపేట	6.23	5.09
గుంటూరు	6.21	5.07
బాపట్ల	6.21	5.07

‘ఆలపాటి’ దూకుడు

- గుంటూరు ఏసీ కాలేజీలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం
- అన్ని రౌండ్లలో ఆలపాటి ముందంజ



కౌంటింగ్ కేంద్రంలో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

సాక్షి ప్రతినిధి, గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి కృష్ణా – గుంటూరు జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు దిశగా సాగుతున్నారు. నాలుగు రౌండ్లు ముగిసే సరికి మొత్తం 28 టేబుళ్లలో 1,12,297 ఓట్లు లెక్కింపు పూర్తి అయ్యింది. ఇందులో 1,00,209 ఓట్లు చెల్లుబాటు కాగా, 12088 చెల్లలేదు. సుమారు పది శాతం ఓట్లు చెల్లకపోవడం గమనార్హం. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 67679 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు 29,188 ఓట్లు వచ్చాయి. ఇద్దరి మధ్యా 38,491 ఓట్ల వ్యత్యాసం ఉంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. పోస్టల్ బ్యాలెట్‌లో 371 ఓట్లు వచ్చాయి. అందులో 316 చెల్లుబాటు కాగా, 55 ఓట్లు చెల్లలేదు. మొత్తం 483 పోలింగ్ బూత్‌లలో పోలైన 2,41,493 ఓట్లును బ్యాలెట్ బాక్స్‌ల నుంచి తీసి 50 చొప్పున 4,828 బండిల్స్ కట్టారు. మిగిలిన 93 ఓట్లతో బండిల్‌లో కట్టే ప్రక్రియ మధ్యాహ్నం సమయానికి పూర్తయింది. ప్రస్తుతం 28 టేబుళ్లకు రౌండ్‌కు 1000 చెప్పున ఓట్లను ఇచ్చి కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియను పరిశీలకురాలు పి. కరుణ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ భార్గవతేజ, పల్నాడు కలెక్టర్ పి. అరుణ్‌బాబు పర్యవేక్షిస్తున్నారు.

ఉదయం నుంచి లెక్కింపు ప్రారంభం

సోమవారం ఉదయం నుంచి గుంటూరులోని ఏసీ కళాశాలలో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యింది. బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాలుకు చేర్చి , పోలింగ్ అయిన ఓట్లు సరిచూసి వాటిని కట్టలు కట్టారు. పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు హాలులో కూర్చొని ప్రక్రియను పరిశీలిస్తుండగా కౌంటింగ్ ప్రారంభం అయ్యింది. చెల్లని ఓట్లను వేరు చేశారు. చెల్లిన ఓట్లను మొదటి ప్రాధాన్యత ఓటు ప్రకారం అభ్యర్థులకు కేటాయించిన ట్రేలలో వేసి లెక్కిస్తున్నారు.

మొదటి రౌండ్ ఫలితం

సాయంత్రం 5:00 గంటలకు మొదటి రౌండులో 28,312 ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సమయానికి చెల్లుబాటు అయిన ఓట్లు 25,242. చెల్లని ఓట్లు 3,070

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి	-17,194
పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు	- 7214
మెజారిటీ	- 9,980

రెండో రౌండ్

రాత్రి 6:45 గంటలకు రెండో రౌండ్‌లో 56,312 ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సమయానికి చెల్లుబాటు అయిన ఓట్లు 50,237. చెల్లని ఓట్లు 6075

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి	- 34,721
పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు	- 13,956
మెజారిటీ	- 20,765

మూడో రౌండ్

రాత్రి 8:15 గంటలకు జరిగిన మూడో రౌండ్‌లో 80,305 ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సమయానికి చెల్లుబాటు అయిన ఓట్లు 71,252. చెల్లని ఓట్లు. 9053

తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి	- 51,443
పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు	- 21,360
మెజారిటీ	- 30,083 ఓట్లు

నాల్గవ రౌండ్

రాత్రి 10 గంటలకు నాల్గవ రౌండ్‌లో 1,12,297 ఓట్లు లెక్కింపు పూర్తయ్యే సరికి చెల్లుబాటు అయిన ఓట్లు 1,00,209. చెల్లని ఓట్లు 12,088

తెలుగుదేశం అభ్యర్థి ఆలపాటి	- 67,679 ఓట్లు
పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు	- 29,188 ఓట్లు
మెజారిటీ	- 38,491

రాజీకి లోక్‌అదాలత్ చక్కటి మార్గం

- సీనియర్ సివిల్ జడ్జి ఎస్.విజయకుమార్‌రెడ్డి
- జాతీయ లోక్‌అదాలత్‌పై పోలీసులతో సమీక్ష

సత్తెనపల్లి: క్షణికావేశంలో తెలిసో తెలియకో చేసిన తప్పులను రాజీ చేసుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్ చక్కటిమార్గమని, రాజీ మార్గమే రాజమార్గఅని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సత్తెనపల్లి విజయకుమార్‌రెడ్డి అన్నారు. ఈ నెల 8వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై సత్తెనపల్లి న్యాయస్థానం పరిధిలో ఉన్న ఆయా పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సబ్ కోర్టు న్యాయస్థాన హాల్లో ఆయన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ముందుగా ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న క్రిమినల్ కేసుల్లో రాజీ పడదగిన సెక్షన్‌కు సంబంధించిన కేసులు ఎన్ని ఉన్నాయి? అని అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని, దానిపై అందరు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సబ్ కోర్టు పీపీ బగ్గి నరసింహారావు, సత్తెనపల్లి పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య, సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు, పెదకూరపాడు సీఐ సురేష్, బెల్లంకొండ ఎస్ఐ ప్రవీణ్, అమరావతి ఎస్ఐ రాజశేఖర్, పెదకూరపాడు ఎస్ఐ-2అల్లూరిరెడ్డి, ముప్పాళ్ల ఏఎస్ఐ మక్కెన మాధవరావు, అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష చేస్తున్న న్యాయమూర్తి

ప్రశాంతంగా సీనియర్ ఇంటర్ పరీక్షలు



శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల వద్ద పరీక్ష కేంద్రం లోపలకు వెళ్లేందుకు వేచిఉన్న విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం సీనియర్ ఇంటర్ పరీక్షలు సెకండ్ లాంగ్వేజ్ పేపరుతో ప్రారంభమయ్యాయి. పరీక్షకు సెట్-1 పేపర్‌ను అధికారులు ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 48 పరీక్షా కేంద్రాలలో జనరల్ విద్యార్థులు 13,268 మందికి గాను 12,870 మంది హాజరయ్యారు, మరో 398మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 702 మందికి గాను 657 మంది హాజరు కాగా 45 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారిణి ఎం.నీలావతిదేవి తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలు...

నరసరావుపేట ఈస్ట్: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్య ఇంటర్మీడియెట్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 9 పరీక్షా కేంద్రాలలో 1,917మంది విద్యార్థులకు గాను 1,727మంది హాజరు కాగా మరో 190మంది గైర్హాజరయ్యారు. డీఈఓ ఎల్.చంద్రకళ పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాలను సందర్శించి చీఫ్ సూపరింటెండెంట్‌లకు పలు సూచనలు చేశారు.

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ట



పెదకూరపాడు: మండల పరిధిలోని గారపాడు గ్రామంలో భద్రావతి సమేత భావనారుషి స్వామివారి ఆలయంలో బాలాలయం ప్రతిష్టా కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. రుత్వికులు బాలకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గోలి యల్లమందయ్య, సంగేపు సుబ్బారావు, చేనేత సంఘం నేత చిల్ల పల్లి సత్యం, గోలి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరుని బ్రహ్మోత్సవ ఆదాయం రూ.44.50 లక్షలు



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవదాయశాఖ ప్రత్యేక అధికారి ఇ.సత్యనారాయణరెడ్డి సమక్షంలో దేవాలయంలో ఉన్న 10 హుండీలతో పాటుగా తాత్కాలిక హుండీలను తెరచి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓ సునీల్‌కుమార్ మాట్లాడుతూ శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం లెక్కింపు చేపట్టగా.. హుండీల ఆదాయం రూ.28,61,262 వచ్చిందన్నారు. అలాగే పూజా టిక్కెట్లు, శివరాత్రి ప్రత్యేక అభిషేక పథకం, లడ్డుప్రసాదం ఇతరాల ద్వారా మొత్తం రూ.15,89,493 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈఏడాది శివరాత్రికి మొత్తం రూ.44,50,755 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో తెనాలి, గుంటూరులకు చెందిన భక్తజన సేవాసమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామంలోకి చుక్కల దుప్పి



బొల్లాపల్లి: వేసవి ఆరంభంలోనే అటవీ ప్రాంతంలోని మూగజీవులు నీటికోసం అలమటిస్తున్నాయి. ఇటీవల వన్యప్రాణులు దాహం తీర్చుకోవడం కోసం గ్రామాల బాట పడుతున్నాయి. సోమవారం కుక్కలు తరముకొస్తుండగా చుక్కల దుప్పి పిల్ల పల్నాడు జిల్లా బొల్లాపల్లిలోకి ప్రవేశించింది. గ్రామంలోని పిల్లలు, పెద్దలు దుప్పిని పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. దుప్పికి వైద్యపరీక్షలు నిర్వహించి అటవీ ప్రాంతంలో వదిలివేశామని బొల్లాపల్లి బీట్ అధికారి రామకృష్ణ తెలిపారు.

డిమాండ్ల సాధన కోసం 6న ధర్నా

నరసరావుపేట: ఆశా వర్కర్ల డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీన నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త ధర్నాలో తాము పాల్గొంటున్నామని ఏపీ ఆశావర్కర్ల యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ధర్నా నోటీసును అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు నిర్వహించి ఒప్పంద కాపీని విడుదల చేసి ఏడాది దాటిందన్నారు. నేటికీ వాటికి సంబంధించిన జీఓలు విడుదల కాలేదన్నారు. పనిఒత్తిడితో అనారోగ్యం పాలవుతున్నా, సెలవులు లేవని, గర్భిణులైన వర్కర్లకు మెటర్నిటీ లీవు సైతం లేదన్నారు. తమను కార్మికులుగా గుర్తించాలని ఏళ్లుగా పోరాడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. తమకు సైతం 62 ఏళ్లకు రిటైర్‌మెంట్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. కె.చంద్రకళ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నమో నారసింహా.. నరమృగవేషా !

- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 13న అర్ధరాత్రి స్వామి కల్యాణ మహోత్సవం
- 14న దివ్య రథోత్సవం

మంగళాద్రి తిరునాళ్లకు సిద్ధమైన నారసింహుడు



స్వామి దివ్య అవతారం

మంగళగిరి: ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రాలలో ఒకటైన మంగళాద్రి శ్రీలక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం ఏడు గంటలకు స్వామిని పెండ్లి కుమారుడిని చేయడంతో ఉత్సవాలు ప్రారంభమై, 16 తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. 6వ తేదీ రాత్రి ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణం ప్రారంభమవుతుంది. ప్రతి రోజు ఒక వాహనంపై భక్తులకు స్వామి దర్శనమివ్వనున్నారు. ధ్వజారోహణం రోజే స్వామి కల్యాణానికి భక్తులు, దేవతలను ఆహ్వానిస్తూ భక్తాగ్రేసురుడైన గరుత్మంతుడిని ధ్వజంపై ప్రతిష్టిస్తారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కలగజేసేందుకు దేవతలందరినీ వారి విధుల్లో నియమిస్తారు.

పలు వాహనాలపై గ్రామోత్సవం

అనంతరం శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు హనుమంత వాహనం, శనివారం రాజ రాజాధివాహనం, ఆదివారం ఉదయం ముత్యాలపల్లకి వాహనం, రాత్రి యాలి వాహనం, సోమవారం ఉదయం చిన్న శేషవాహనం, రాత్రి సింహ వాహనం, మంగళవారం ఉదయం హంస వాహనం, రాత్రి గజవాహనం, బుధవారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి పొన్న వాహనం, గురువారం ఉదయం అశ్వ వాహనాలపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. శ్రీదేవి , భూదేవి సమేతుడైన శ్రీవారు పురవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాలలో భక్తులతో పాటు కైంకర్యపరులు, ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొని స్వామిని దర్శించుకుంటారు. ఉత్సవాలలో ముఖ్యంగా పొన్న వాహనం సేవ అత్యత ప్రధానమైనది.

రథోత్సవానికి ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన స్వామి కల్యాణం 13వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు కల్యాణ వేదిక మైదానంలో జరగనుంది. వేలాది మంది భక్తుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. స్వామి ఎరుక్కోల మహోత్సవం జరుపుకుని కల్యాణ వేదికపైకి చేరుకుని భక్తులకు దర్శనమిస్తారు. 14వ తేదీ శుక్రవారం ఉదయం బంగారు గరుడోత్సవం నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు స్వామి దివ్య రథోత్సవం జరుగుతుంది. మెయిన్‌బజార్‌లోని మిద్దె సెంటర్‌లోని శ్రీ అంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకుని అక్కడ పూజలు అందుకుని తిరిగి ఆలయానికి ఉత్సవం చేరుకుంటుంది. లక్షలాది సంఖ్యలో భక్తులు రథోత్సవంలో పాల్గొంటారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతి రోజు ఆలయం వద్ద ప్రత్యేకంగా సాయంత్రం ఆరు నుంచి పది గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

లైట్ ఫుడ్.. గుడ్

- పరీక్షల సమయంలో డైట్‌పై శ్రద్ధ అవసరం
- నూనె పదార్థాలతో అతి దాహం
- తిన్న తర్వాత పాలు తాగడం మంచిది
- చికెన్, మటన్‌లకు దూరంగా ఉండాలి



గుంటూరు మెడికల్: పిల్లల ఆహారం విషయంలో తల్లిదండ్రులు ఎప్పుడూ కంగారు పడుతూనే ఉంటారు. పరీక్షల సమయంలో ఇక ఆందోళన చెప్పనవసరం లేదు. చదువు ధ్యాసలో పడి విద్యార్థులు కూడా సరిగ్గా తిండి తినకపోతే నీరసించి పరీక్షలు రాయలేకపోతారు. ఇటువంటి సమయాల్లో తల్లిదండ్రులే డైట్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై సాక్షి 'అందిస్తున్న ప్రత్యేక కథనం.

టిఫిన్‌గా నూనె పదార్థాలు వద్దు

ఉదయం తీసుకునే అల్పాహారంలో నూనె వస్తువులు లేకుండా చూసుకోవాలి. ఆయిల్ ఫుడ్స్‌ను బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకోవడం వల్ల తరచూ దాహం వేస్తుంది. పరీక్ష రాసే సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడతారు. తప్పనిసరిగా అల్పాహారం తీసుకోవాలి. సులువుగా అరిగిపోయే ఆహార పదార్థాలను టిఫిన్‌గా తీసుకోవాలి. ఇడ్లీ చాలా మంచింది. మిక్స్‌డ్ వెజిటబుల్ కిచిడీ, గోధుమ రవ్వ ఉప్మా కూడా బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవచ్చు.


జ్ఞాపకశక్తి కోసం బీ-12 విటమిన్ అవసరం

విద్యార్థులు చదివింది గుర్తుపెట్టుకోటానికి విటమిన్- బి12 ఉపయోగపడుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుదలకు ఉపయోగపడే ఈ విటమిన్ మాంసపు ఉత్పత్తుల్లో అధికంగా లభిస్తుంది. మాంసం తినటానికి ఇష్టపడని వారు రోజుకు రెండు ఉడికించిన గుడ్లు తినడం మంచిది. మధ్యాహ్నం భోజనంలో ఒక ఆకుకూర తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. కూరగాయలతో చేసిన కూర, పెరుగు లేదా మజ్జిగ తీసుకోవాలి. భోజనం అనంతరం ఏదైనా ఒక పండు తింటే మంచిది.

రాత్రి 7.30కల్లా భోజనం ముగించాలి

రాత్రి భోజనం 7.30 గంటలకల్లా ముగిస్తే చాలా మంచిది. పప్పుకూర, రసం, సాంబారు, పెరుగు, మజ్జిగ ఉండేలా చూసుకోవాలి. నిద్రకు గంట ముందుగా గ్లాసు పాలు తాగడం ఉత్తమం. రాత్రిళ్లు ఎక్కువ సమయం వేచి ఉండవద్దు. సరిపడా కంటికి నిద్ర లేకపోతే అనేక అనర్థాలు తలెత్తుతాయి. కనీసం ఏడు గంటలు నిద్ర పోవడం మంచిది. సీజన్‌లో లభించే పండ్లు, ముఖ్యంగా విటమిన్ సీ ఎక్కువగా లభించేవి తీసుకోవడం చాలా మంచిది.

మాంసాహారం తగ్గించటం ఉత్తమం



పరీక్షల సమయంలో విద్యార్థుల్లో విపరీతమైన ఒత్తిడి వల్ల ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వాంతులు, విరోచనాలు, కడుపులో నొప్పి వంటి లక్షణాలు ఇందులో కనిపిస్తాయి. విద్యార్థులు సాఫ్ట్ డైట్ తీసుకోవాలి. ముఖ్యంగా వెజిటబుల్స్, ఫ్రూట్స్ సలాడ్స్ ఎక్కువగా తీసుకుని మాంసాహార ఉత్పత్తులు సాధ్యమైనంత మేరకు తగ్గించడం చాలా మంచిది. రాత్రిపూట 7 గంటలకల్లా భోజనం చేయాలి.

– డాక్టర్ యద్ల హనుమాన్ ప్రసాద్,
గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు

సీఎంను కలిసిన చిట్‌ఫండ్ బాధితులు

- న్యాయం చేయాలని వినతి
- చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఎం హామీ



సీఎం చంద్రబాబును కలిసిన బాధితులు

తాడేపల్లి రూరల్: పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సాయిసాధన చిట్‌ఫండ్ ప్రైవేటు లిమిటెడ్ బాధితులు సోమవారం రాత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆయన నివాసం వద్ద కలిశారు. బాధితులు చిట్‌ఫండ్ యాజమాన్యం చేసిన మోసాన్ని సీఎంకు వివరించారు. సుమారు 600 మంది చిట్‌ఫండ్ వల్ల నష్టపోయామని తెలిపారు. అందరం పేదలని, తమకు న్యాయం చేయాలని సీఎంను కోరారు. స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు బాధితులకు ధైర్యం చెప్పి, చిట్‌ఫండ్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పర్చూరు నియోజకవర్గంలో

ఫారం-7తో ఓట్ల తొలగింపుపై సిట్

- ప్రకాశం ఎస్పీ నేతృత్వంలో ఇద్దరు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: బాపట్ల జిల్లా పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గంలో జీవించి ఉన్న ఓటర్లు మృతి చెందినట్లుగా పేర్కొంటూ ఫారం-7తో ఓట్ల తొలగింపునకు పాల్పడటంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం ఎస్పీ నేతృత్వంలో మరో ఇద్దరు సభ్యులతో సిట్ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజ్ఞప్తి ఆధారంగా సిట్ ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. 24,000 ఓట్లు తొలగింపునకు పారం-7 దరఖాస్తులను అక్రమంగా చేశారని, జీవించి ఉన్న వారు మృతి చెందినట్లు పేర్కొన్నారని ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో గతంలోనే కేసు నమోదు చేశారు. అయితే ఎటువంటి చర్యలను తీసుకోలేదని, దీనిపై సిట్ చేత దర్యాప్తు చేయించాలని ఎమ్మెల్యే కోరినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రకాశం ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ నేతృత్వంలో గుంటూరు పశ్చిమ డీఎస్పీ అరవింద్‌తోపాటు డీజీపీ ద్వారా మరో అధికారి నియమించుకుని దర్యాప్తు చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సీఐడీ డీజీ ఆదేశాలు, పర్యవేక్షణలో సిట్ పనిచేయాలని పేర్కొన్నారు. సిట్ సాక్షులను, పత్రాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టానికి లోబడి నిందితులను అరెస్టు చేయడం, నిర్బంధించడం చేయవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దర్యాప్తు పురోగతికి సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు త్రైమాసిక నివేదికను సిట్ సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

న్యాయవాద వృత్తిలో నిజాయతీ అవసరం

హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ జనరల్ శివయ్యనాయుడు



హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ జనరల్ శివయ్య నాయుడును సత్కరిస్తున్న న్యాయవాదులు

చీరాల రూరల్: న్యాయవాద వృత్తిలో రాణించాలంటే ఎంతో నిబద్ధత, నిజాయితీతో నిరంతరాయంగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత రిజిస్ట్రార్ జనరల్ ఎస్.శివయ్య నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఆయన చీరాల వచ్చిన సందర్భంగా చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తాను 30 ఏళ్ల కిందట చీరాల కోర్టులో న్యాయమూర్తిగా పనిచేసినప్పటికి తనను గుర్తుపెట్టుకుని చీరాలకు ఆహ్వానించి ఇంతగా అభిమానించడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. చీరాలలో న్యాయవాదులు ఎంతో సౌమ్యులని, మృదు స్వభావం గలవారని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ శివయ్యనాయుడుకు జీడిపప్పు దండవేసి శాలువాతో సత్కరించారు. అలానే 25 మంది జూనియర్ న్యాయవాదులకు కొత్తగా వచ్చిన క్రిమినల్ న్యాయ చట్టాలకు సంబంధించిన పుస్తకాలను ఆయన చేతులు మీదుగా అందజేశారు. అలాగే విశ్రాంత జిల్లా అదనపు న్యాయమూర్తులు గిరిజా మనోహర్, లక్ష్మీనారాయణ, ఏపీ న్యాయవాద గుమస్తాల సంఘాన్ని ఏర్పాటు చేసి, న్యాయవాద గుమస్తాలకు సంక్షేమ పథకాల ఏర్పాటుకు కృషిచేసిన సీనియర్ న్యాయవాద గుమస్తా కాజా సూర్యప్రకాశరావును పూలమాలలువేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని హెచ్ఎంలు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 10వతేదీ లోపు తెలియచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్ఎంలు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) ద్వారా రూపొందించామన్నారు. జాబితాలు జిల్లా విద్యాశాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల కార్యాలయాలతో పాటు విద్యాశాఖ వెబ్‌సైట్, నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అభ్యంతరాలు తెలిపే ఉపాధ్యాయులు తమ పూర్తిపేరుతో కూడిన వివరాలు, జాబితాలోని తప్పిదం స్పష్టంగా పేర్కొనటంతో పాటు ఆధారాలు సమర్పించాలని సూచించారు. గడువు ముగిసిన తరువాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోమన్నారు. వచ్చిన అభ్యంతరాలపై ఫిర్యాదుల పరిష్కార కమిటీ పరిశీలించి తుది నిర్ణయం తెలియచేస్తారని తెలిపారు. వివరాలకు జిల్లా విద్యాశాఖ, జోనల్ విద్యాశాఖ కార్యాలయాలలో సంప్రదించాలన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు




నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని విద్యాసంస్థల్లో మహిళల భద్రత, హక్కులు, సాధికారిత, మహిళా చట్టాలు, పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై ఈ పోటీలను నిర్వహించారు. పోటీల అనంతరం స్టేషన్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో విద్యార్థినులతో సమావేశాలను ఏర్పాటు చేసి మహిళల రక్షణకు పోలీస్‌శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. అత్యవసర సమయంలో సహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు చైల్డ్ 1098, ఉమెన్ 181, పోలీస్ 112, సైబర్ క్రైమ్ 1930 నెంబర్లకు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు.

బంగారం చోరీ కేసులో మరో నిందితుడి అరెస్టు

మంగళగిరి: ఆత్మకూరు అండర్ బైపాస్ వద్ద ఫిబ్రవరి 5న జరిగిన ఐదు కేజీల బంగారం చోరీ కేసులో మరో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. చోరీలో ఐదవ నిందితుడు ఖాజావలి కోర్టులో లొంగిపోయేందుకు రాగా, నిఘా ఉంచిన అధికారులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. నిందితులందరినీ అరెస్ట్ చేసిన పోలీసులు విచారణ అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే.

సన్మార్గ దర్శిని దివ్య ఖురాన్

- సాఫల్య జీవితానికి నిర్దేశిని
- శాంతియుత జీవనానికి సోపానం



ఖురాన్ పఠిస్తున్న బాలురు

చిలకలూరిపేట: ప్రపంచంలోని ముస్లింలందరికీ నెలరోజుల పండుగ రంజాన్. దివ్యఖురాన్ దైవం నుంచి భువికి అవతరించిన మాసం కూడా ఇదే. ఈ పవిత్ర గ్రంథం వెలుగులో ఆత్మప్రక్షాళన చేసుకొనే అవకాశం కల్పిస్తుంది. సాఫల్య జీవితానికి సోపానం దివ్యగ్రంథం పవిత్ర ఖురాన్. అల్లా నుంచి అవతరించి భూమిపైకి వచ్చిన గ్రంథం కావటంతో దీనిని దివ్యఖురాన్ అంటారని మౌల్వీలు పేర్కొంటున్నారు. మానవుడు ఉన్నత జీవితం గడిపేందుకు అవసరమైన అన్ని సూచనలు, నియమాలు ఇందులో పొందుపరిచి ఉన్నాయి. ప్రాపంచిక విషయాల్లో ఎదురయ్యే ఎలాంటి ఒడిదుడుగులకైనా ఈ గ్రంథంలో పరిష్కార మార్గం ఉంటుంది. మానవ సంబంధాలు, శాంతియుత జీవనం, అహింస, విశ్వసనీయత, సౌభ్రాతృత్వం, రోజువారీ జీవితం ఎలా గడపాలి వంటి ఇహలోక అంశాలతో పాటు పరలోక సౌఖ్యం పొందటానికి అవసమైన మూలసూత్రాలు ఇందులో పొందుపరిచి ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇహ, పరలోకాల సౌఖ్యం, సాఫల్య జీవితానికి మూల సూత్రాలే దివ్య గ్రంథంలోని ప్రధాన అంశాలు. పవిత్ర ఖురానులో సూచించిన మార్గాన్ని మహ మ్మద్ ప్రవక్త అనుసరించారు. ఈ లోకానికి ఆచరించి చూపారు. దివ్య ఖురాన్ రంజాన్ మాసంలో అవతరించటంతో ముస్లింలు ఈ మాసంలో ఖురాన్‌ను పఠిస్తూ దాని పవిత్రతను చాటుతుంటారు. ఖురాన్‌లో 114 సూరాలు, 6,666 ఆయాత్‌లు, 540 రుకూలు ఉంటాయి. సంపూర్ణ గ్రంథాన్ని 30 భాగాలుగా విభజించారు. వాటిని పారాలుగా పేర్కొంటారు. రంజాన్ మాసంలో తరావి నమాజు కింద పూర్తిపఠనం గావిస్తారు.

మహిమాన్విత వరం..

దైవం దివ్యఖురానును ప్రపంచ మానవాళికి మహిమాన్విత వరంగా ప్రసాదించారు. అజ్ఞానపు కారు చీకట్ల నుంచి విజ్ఞానమనే వెలుగు బాటను చూపిన ఈ దివ్య గ్రంథం మానవుడి అవివేకాన్ని తుడిచి పెట్టేందుకు ఉత్తమమైన మార్గంగా నిలుస్తోంది. మామూలు వ్యక్తిని కూడా మహోన్నతునిగా మార్చేందుకు దోహదపడుతుంది. ఈ దివ్యగ్రంథంలో మొత్తం 30 భాగాలు ఉంటాయి. మొదటి భాగం 'ఎఖ్రా' (విద్య) సంబంధించినది. దీని ద్వారా ప్రతి ఒక్కరికీ చదువు తప్పనిసరి అన్న సూచన అందుతోంది. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించాల్సిన విధుల గురించి ఈ సూచనలు ఎంతో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ఈ మాసంలో ధనికులు జకాత్, ఫిత్రాలను ఖచ్చితంగా అందజేస్తే రంజాన్ ఈద్ ప్రార్థన సమయానికి పేదలనే వారు ఉండరని ఈ గ్రంథం వివరిస్తుంది. మానవుడిలోని మద్యపానం, వ్యభిచారం, పాపం, ద్రోహం, హింస, చెడుగా మాట్లాడటం, కించపరచాలనుకోవటం వంటి విషయాలను ఈ గ్రంథం తీవ్రంగా నిరసిస్తుంది. నైతిక విలువలతో జీవించాలని ప్రబోధిస్తుంది. ఖురాన్‌ను చదివి, దానిని పాటించేవారికి స్వర్గలోక ప్రాప్తి లభిస్తుందని మౌల్వీలు చెబుతారు. పఠించేవారికి ప్రశాంతతో పాటు మనశ్శాంతి లభిస్తుందని విశ్వాసుల నమ్మకం.

జీవితాంతం పఠించాలి..



దివ్యఖురాన్ సాధారణ గ్రంథం కాదు. ఇది దైవం మనకు ప్రసాదించిన దివ్యమైన కాంతిపుంజం. దాని పవిత్రతను తెలుసుకొని ఆచరించి ఆరాధిస్తే దైవం ద్వారా మనకు స్వర్గం ప్రాప్తిస్తుంది. ఈ పవిత్ర రంజాన్ మాసంలో పఠించటం ముఖ్యమే అయినా జీవితాంతం క్రమం తప్పకుండా పఠించి, పాటించడం ముక్తిదాయకం. ఖురాన్‌ను నేర్చుకుంటూ, ఇతరులకు నేర్పేవారు ఈ భూమిపై అందరికంటే ఉన్నతులు.

– మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్ నద్వి, ఇస్లామిక్ పండితుడు

కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ వర్కర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

లక్ష్మీపురం: ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మున్సిపల్ కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. తీరా గద్దె నెక్కాక వాటిని మరిచిందని విమర్శించారు. అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేసి దాని స్థానంలో ప్రైవేట్ కంపెనీలకు, ఏజెన్సీలకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఉద్యోగుల జీవితాలతో వారు చెలగాటం ఆడతారని తెలిపారు. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను పెంచాలని కోరారు. విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆప్కాస్ ఉద్యోగ, కార్మికుల రిటైర్మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి కోట మాలాద్రి, మంగళగిరి పట్టణ కార్యదర్శి దుర్గారావు, కార్మికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో భక్తిభావం

విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ



విశేష అర్చన చేస్తున్న విశ్వంజీ

ప్రత్తిపాడు: ఆధ్యాత్మిక చింతనతో భక్తిభావం కలుగుతుందని విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ అన్నారు. విశ్వంజీ జన్మదిన వేడుకల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం మండల పరిధిలోని చినకోండ్రుపాడు విశ్వనగర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల మధ్య విశ్వంజీ ఔదంబర వృక్ష పీఠ సుస్థాపిత దత్త గురువులకు విశేష అర్చన చేశారు. అనంతరం యాగశాలలో వేద పండితులు శాస్త్రోక్తంగా అగ్ని ప్రతిష్ఠ, మహాగణపతి హవనం, సుదర్శన నారసింహ, శ్రీ మహారుద్ర హవనములు, స్థాపిత దేవతా పంచోపచార పూజ, నీరాజన, మహామంత్రపుష్ప చతుర్వేద సేవలను చేశారు. తొలుత శాంతిపాఠం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యమేళన ప్రాశనం, రక్షాబంధనం, ఆచార్యాది ఋత్విక్ వరణం, వాస్తు, నవగ్రహ, యోగిని, క్షేత్రపాలక, సర్వతోభద్ర, సుదర్శన నారసింహ, మహామృత్యుంజయ సప్త చిరంజీవి ఆవాహనం, అఖండదీప స్థాపన కార్యక్రమాలు వైభవోపేతంగా జరిగాయి. విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు, కామేశ్వరి దంపతులతో విశ్వంజీ ప్రత్యేక పూజలు చేయించారు. రాత్రి ఆడిటోరియంలో విశ్వణి కూచిపూడి నాట్య ప్రదర్శన, లోల మనస్వి, నిధిమల భరతనాట్య ప్రదర్శన, కొటూరి గాయత్రి సంగీత విభావరి, ఫణికుమార్ వేణుగాన కచేరీలు అలరించాయి.

ట్రావెల్ బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులంతా క్షేమం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ శ్రీనివాసరావు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

రొంపిచర్ల: మండలంలోని సుబ్బయ్యపాలెం అడ్డరోడ్డు సమీపంలోని అద్దంకి నార్కెట్‌పల్లి రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో బస్సు వెనుక భాగం ధ్వంసం అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును అదే మార్గంలో వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టింది. బస్సు వెనుక భాగంలో ఇంజిన్ ఉండటం వల్ల లారీ ఢీకొట్టినా ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరగటానికి గల కారణాలపై ఆరా తీశారు. రాత్రిళ్లు రహదారిపై వాహనాలు ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేయకుండా పెట్రోలింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు వెంట పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

లోకేష్ రాజ్యాంగం మేరకే పోసానిపై అక్రమ కేసులు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



కోర్టు బయట మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై లోకేష్ రాజ్యాంగం మేరకు తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారని పల్నాడు జిల్లా నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాజంపేట పోలీసుల అదుపులో ఉన్న పోసానిని నరసరావుపేట పోలీసులు పీటీ వారెంట్‌పై కోర్టుకు తీసుకొస్తున్నారనే సమాచారం మేరకు అక్కడకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. 2023లో స్థానిక టీడీపీ నాయకుడు కొట్టా కిరణ్‌కుమార్ తమ నాయకులు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, లోకేష్‌లను పోసాని అసభ్య పదజాలంతో తిట్టారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకొస్తున్నారన్నారు. ఈవిధంగా పోసానిని వేధించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 14 చోట్ల కేసులు నమోదు చేయించి అతడిని అరెస్టుచేసి స్టేషన్లవారీగా తిప్పాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించటం దారుణమన్నారు. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి బదులు లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందనేది స్పష్టమవుతుందన్నారు. పోసానికి మద్దతుగా న్యాయవాదులు అందరూ వచ్చారని, కోర్టులో బెయిలు తీసుకుంటామని వెల్లడించారు. జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, న్యాయవాదులు ఆర్.శ్రీనివాసరావు, ఆరె శ్రీనివాసరెడ్డి, సీతారామిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సేవలు ప్రైవేటుకు అప్పజెప్పొద్దు

కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ నేతలు, కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

నరసరావుపేట: జీఓవెంటనే 279ని సత్వరం రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు పారిశుద్ధ్య సేవలు అప్పజెప్పే విధానాన్ని విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గతంలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం తక్షణమే సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 11న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించి లక్షలాదిగా తరలివెళ్తామన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, దాసరి రాజు, జయరాజు, వరహాలు, వందనం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్సిటీ మహిళల బాల్ బాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పాల్గొన్న ఐదు కళాశాలల జట్లు



పోటీలను ప్రారంభిస్తున్న వర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ పాల్‌కుమార్, కోటేశ్వరమ్మ

నరసరావుపేట రూరల్: మహిళలు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్‌కుమార్ తెలిపారు. వర్సిటీ అంతర కళాశాలల మహిళల బాల్ బాడ్మింటన్ పోటీలు కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. పోటీలో ఐదు జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీపీఎస్ పాల్‌కుమార్, టైనీటాట్స్ స్కూల్ అధినేత పాతూరి కోటేశ్వరమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉంటూ ఆటలాడుతూ చదువులో కూడా ముందుండాలని సూచించారు. పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో వర్సిటీ జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. కరైకుడిలోని అల్లప్ప యూనివర్సిటీలో నిర్వహించే ఆల్ ఇండియా అంతర వర్సిటీ పోటీల్లో వర్సిటీ జట్టు పాల్గొంటుందని తెలిపారు. పోటీలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ సిహెచ్ వెంకట్రావు, జె.ప్రేమ్‌కుమార్, ఇ.ఆదిబాబు, డాక్టర్ అరుణ సుజాతలు వ్యవహరించారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, డైరక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదపై దృష్టి పెట్టాలి

- గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేయాలి
- జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డి
- జిల్లాలోని మండల విస్తరణ అధికారులకు గుడిపూడిలో శిక్షణ



గుడిపూడి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో భోజనాలు చేస్తున్న డీపీఓ భాస్కర్ రెడ్డి, లక్ష్మణరావు తదితరులు

సత్తెనపల్లి: చెత్త నుంచి గ్రామ పంచాయతీలకు ఆదాయం చేకూర్చాలని జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డి అన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా గ్రామ పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణపై జిల్లాలోని అన్ని మండలాల విస్తరణాధికారులకు సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి హరిత రాయబారుల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ జరగాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా సేకరించి చెత్తను సంపద తయారీ కేంద్రానికి చేర్చి వర్మీ కంపోస్ట్ తయారు చేయడం, పొడిచెత్తను వేరుచేసి విక్రయించి గ్రామపంచాయతీలకు ఆదాయం చేకూర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఎటువంటి చెత్త కుప్పలు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేయాలన్నారు. అలా చేయని పంచాయతీ కార్యదర్శులు, మండల విస్తరణాధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, మండల విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ చెత్త సేకరణ చేయించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనే హెచ్చరికలు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా ఘన వ్యర్థాల నిర్వహణపై జిల్లా రిసోర్స్ పర్సన్‌లు ఆర్.నరసింహ నాయక్, విశ్వరూపాచారిలు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో సామూహిక భోజనాలు చేశారు. తొలుత జిల్లాలోనే ఆదర్శంగా గుడిపూడిలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును తీర్చిదిద్దిన గ్రామ పంచాయతీ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావును అభినందించారు. నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారి వీవీఎం లక్ష్మణరావు, జిల్లాలోని 28 మండలాల మండల విస్తరణ అధికారులు, హరిత రాయబారులు, పాల్గొన్నారు.

మిర్చి రైతులకు అండగా ఉంటాం



రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సంఘ నాయకులు

లక్ష్మీపురం: మిర్చి రైతులకు అండగా ఉంటామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నేతలు స్పష్టం చేశారు. సోమవారం గుంటూరు మిర్చి యార్డును నేతలు సందర్శించారు. రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన రూ.11,781 మద్దతు ధరతో రైతుల ఆశలు అడియాసలయ్యాయని తెలిపారు. కనీసం రూ.20వేలు అయినా ప్రకటిస్తారని ఎదురు చూశారని పేర్కొన్నారు. తీరా గుంటూరు మార్కెట్ యార్డుకు వస్తే వ్యాపారస్తుల దోపిడీకి రైతులు బలి అవుతున్నారని చెప్పారు. మచ్చు, కమిషన్, గోతం పేరులతో క్వింటాకు వెయ్యి రూపాయల వరకు దోపిడీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆసియాలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డులో ఎన్నో రైతుల కన్నీటి గాథలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. జగన్నాథం, కంజుల విఠల్ రెడ్డి, పల్నాడు జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమారెడ్డి, వీరారెడ్డి, రామయ్య పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్‌కు మంటలు



పర్చూరు(చినగంజాం): డ్రైవర్ చాకచక్యంతో పెనుప్రమాదం తప్పింది. వరిగడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగిలి నిప్పులు చెలరేగడంతో తీవ్రంగా మంటలు చెలరేగి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో సోమవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన వరిగడ్డిని పొలం నుంచి ఇంటికి చేరుస్తున్నాడు. ఈక్రమంలో వరిగడ్డి ట్రాక్టర్ పంచాయతీ కార్యాలయం ముందుగా వెళ్తున్న సమయంలో ఆ మార్గంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి వరిగడ్డి పూర్తిగా తగలబడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ తరుణంలో ట్రాక్టర్ డ్రైవర్ ఆనందరావు చాకచక్యంగా వ్యవహరించాడు. తానేమాత్రం భయాందోళనకు గురికాకుండా గడ్డిని పక్కన పడేసి అందులో ఉన్న కూలీలను, ట్రాక్టర్‌ను కాపాడాడు. వెంటనే స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గడ్డి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.50 వేలు వరకు నష్టం వాటిల్లి ఉంటుందని సమాచారం.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్టు


పరారైన మరో ఇద్దరు



సమావేశంలో మాట్లాడుతున్న తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతానగరం రైల్వే బ్రిడ్జి సమీపంలో గంజాయి అమ్ముతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. ఈ సంఘటనపై సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కల్యాణ్ రాజు వివరాలు వెల్లడించారు. విజయవాడలోని విద్యాధరపురానికి చెందిన గుమ్మడి సాయికుమార్ మరో ఇద్దరు యువకులు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి సీతానగరం రైల్వే బ్రిడ్జి వద్దకు వెళ్లామని తెలిపారు. ఈ దాడిలో సాయికుమార్ వద్ద 1050 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఉండవల్లికి చెందిన మహేష్, విజయవాడకు చెందిన కోటి పరారయ్యారని పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న సాయికుమార్‌ను కోర్టుకు హాజరు పరచనున్నామని తెలిపారు. గంజాయి అమ్మకాలతో పాటు తాగే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శబ్దకాలుష్యం నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి



బాపట్ల: శబ్ద కాలుష్యం నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ పేర్కొన్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన ప్రదర్శనను డాక్టర్ విజయమ్మ ప్రారంభించారు. డాక్టర్ విజయమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వినికిడి ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. చెవి వినడం ఆరోగ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పెద్ద, పెద్ద శబ్దాల నుంచి చెవిని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.